క్లుప్తంగా

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు దేవరకొండ శంకరనారాయణశర్మ ఆధ్వర్యంలో స్వామికి పాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి చిరంజీవులు, రాజారావు ఉన్నారు.

రిమ్స్ అన్నపూర్ణకు రూ.10 వేల విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్ అన్నపూర్ణ నిత్య అన్నదాన పథకానికి పట్టణానికి చెందిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి పి.శివన్నారాయణ దంపతులు రూ.10 వేలు విరాళంగా బుధవారం అందించారు. ఈ విషయాన్ని జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సేవా సమన్వయకర్త పప్పల నాగేశ్వరరావు, మేనేజర్ లక్ష్మణరావు, వేంకటరావు, శ్రీరాములు, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రముఖులను కలిసిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్



వెంకయ్యనాయుడుతో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్, తదితరులు

రణస్థలం: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును విశాఖపట్నంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబును, సెయిల్ డైరెక్టర్, బీజేపీ ఏపీ జనరల్ సెక్రటరీ కాశీ విశ్వనాథ్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఎచ్చెర్ల నియోజకవర్గ కూటమి నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని 43వ డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు పౌష్టకాహారాన్ని బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో 43వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి తోనంగి వెంకన్న యాదవ్, అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకే 'అమ్మకు వందనం' ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న సంఘ ప్రతినిధులు

టెక్కలి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకే అమ్మకు వందనం పథకం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం డిమాండ్ చేసింది. టెక్కలిలో జిల్లా స్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలల్లో యధాతథంగా ఒకటి నుంచి ఐదు తరగతులు నిర్వహించాలని, పాఠశాల మౌలిక వసతుల బాధ్యతల నుంచి ప్రధానోపాధ్యాయులను తప్పించాలని, పాఠశాల విద్యుత్ చార్జీలు ప్రభుత్వమే నేరుగా చెల్లించాలని, జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర సహాధ్యక్షుడు ఎన్.లక్ష్మణరావు, కోశాధికారి చిలుకు కృష్ణారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వై.హరిబాబుతో పాటు సీతారామరాజు, కె.హేమలత, సీహెచ్ రమాదేవి, డి.గోవిందరావు, టి.వెంకటరమణ, ఆర్.మధుబాబు, సీహెచ్.విశ్వనాథం పాల్గొన్నారు.

రోడ్లతోనే ప్రగతి

కవిటి: రహదారులే అభివృద్ధికి దోహదపడతాయని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బి.అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలోని తన కార్యాలయంలో సోంపేట సబ్‌డివిజనల్ స్థాయి ఆర్అండ్‌బీ శాఖ అధికారులతో శాఖాపరమైన సమీక్షను బుధవారం నిర్వహించి మాట్లాడారు. ఆర్అండ్‌బీ డీఈఈ రామినాయుడు, జేఈఈ పాల్గొన్నారు.

జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు

• వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనం



గుజరాతీపేటలో నరసింహ అవతారంలో జగన్నాథుడు



ఇల్లీసుపురంలో వరాహ అవతారంలో దర్శనమిచ్చిన స్వామివారు



పాండ్రంగివీధిలో గోవర్ధన గిరిదారిగా జగన్నాథుడు

శ్రీకాకుళం కల్చరల్: జగన్నాథస్వామి రథోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ రూపాల్లో భక్తులకు స్వామివారు దర్శనమిస్తున్నారు. గుజరాతీపేటలోని జగన్నాథస్వామి దేవాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా స్వామిని సీతారామ లక్ష్మణ అవతారంగా బుధవారం అలంకరించారు. అర్చకులు పెంట సోదరుల ఆధ్వర్యంలో భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అలాగే ఇల్లీసుపురం కూడలిలోని జగన్నాథస్వామిని వరాహ అవతారంలో అలంకరించారు. సుభద్ర, బలభద్రులతో పాటుగా జగన్నాథస్వామిని అలంకరించగా భక్తులు అధికసంఖ్యలో స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బాలకృష్ణ పాణిగ్రాహి పాల్గొన్నారు. మొండేటివీధిలోని శివకామేశ్వరస్వా మి దేవాలయం ఆవరణలో షిర్డీసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న జగన్నాథ యాత్రలో భాగంగా స్వామివారిని రామావతారంలో అలంకరించారు. అలాగే పాండ్రంగి వీధి రామమందిరంలో స్వామివారు గోవర్ధన గిరిదారిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకులు వేదుల ప్రదీప్, ధర్మకర్త నర్సింహమూర్తి పాల్గొన్నారు.

వర్షం కోసం ఎదురుచూపు



ధర్మవరం పంచాయతీ పరిధిలో మొలకెత్తని వరి వెదలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇప్పటివరకు సరైన వర్షాలు కురవలేదు. ఎచ్చెర్ల మండలంలో నారాయణపురం కుడి కాలువ కింద చాలా గ్రామాలు రైతులు వరి వెదలు చల్లారు. ధర్మవరం, ముద్దాడ, పొన్నాడ, ఫరీదుపేట, కొంగరాం ప్రాంతాల్లో వేల ఎకరాల్లో వెదలు వేశారు. గత 10 రోజుల నుంచి వర్షాలు లేకపోవటంతో మొలక రాలేదు. ఇలా మరికొద్ది రోజులు ఉంటే మళ్లీ విత్తనాలు చల్లాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కాలువ ద్వారా నీరు విడిచి పెట్టలేదు. వర్షాలు అనుకూలించికపోతే శివారు భూములకు కాలువ ద్వారా సాగునీరు చేరటానికి తీవ్ర జాప్యం కలుగుతుంది. వర్షాలు అనుకూలించక, కాలువ ద్వారా సాగునీరు రాకపోవడంతో రైతులు వరుణ దేవుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు. విత్తన, సాగు యాజమాన్య ఖర్చులు వేలల్లో నష్టపోయే పరిస్థితితులు కనిపిస్తున్నాయి.

కషాయాల తయారీపై అవగాహన

ఎచ్చెర్ల: పంటలకు ఉడుకు తెగుళ్లు రాకుండా కషాయాలను వాడాలని ప్రకృతి వ్యవసాయం తమ్మినాయుడపేట యూనిట్ ఇన్‌చార్జ్ చంద్రకళ తెలిపారు. కొత్తపేటలో వావిలాకు, తూటికాడ కషాయాల తయారీపై అవగాహన కల్పించారు. రాజీలేని సూత్రాల్లో భాగంగా పసుపు, తెలుపు పళ్లాలు, లింగాకర్షక బుట్టలు పెట్టుకుని తద్వారా తెగుళ్లు, పురుగులు గమనించి సరైన సమయంలో కషాయాలను వాడుకోవాలన్నారు. పంటలకు ఉడుకు తెగుళు సోకడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. మహిళా రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

గార: ఎరువుల యాజమాన్య పద్ధతుల ద్వారా వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి డి.పద్మావతి అన్నారు. కొర్ని, కొర్లాం, వత్సవలస పంచాయతీల్లో కౌలు రైతుల అవగాహన సమావేశాలను బుధవారం నిర్వహించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో జె.శ్రీదీప్తి, కొర్లాం సర్పంచ్ పీస శ్రీహరి రావు ఉన్నారు.

సంతాపం..

ఎచ్చెర్ల క్యాంపస్: పూడివలస గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు జరుగుళ్ల కృష్ణారావు తల్లి రామలక్ష్మి అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలియజేశారు. పలువురు నాయకులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

తీర ప్రాంత గ్రామాల్లో నిఘా

ఎచ్చెర్ల క్యాంపస్: తీర ప్రాంత భద్రతపై ప్రజల్లో పోలీస్, మెరైన్ శాఖల ఆధ్వర్యంలో సాగర్ కవచ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం అవగాహన కలించారు. ఎచ్చెర్ల మండలంలోని డి.మత్స్యలేశం, బడివానిపేట, బుడగుట్లపాలెం తీర ప్రాంత గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియన వ్యక్తులు తీరానికి రావటం, గతంలో తీవ్రవాదులు మత్స్యకార గ్రామాల్లోకి రావటం వంటి సంఘటనలు ప్రజలకు వివరించారు. దేశ రక్షణలో భాగంగా తీవ్రవాదం, సంఘ విద్రోహ శక్తులపై ప్రజల్లో అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

గిరిజనోద్యమ నిర్మాతలకు ఘనంగా నివాళి



నినాదాలు చేస్తున్న నాయకులు

పలాస: శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాట నిర్మాతలు వెంపటాపు సత్యం, ఆదిబట్ల కైలాసంలకు బుధవారం ఘనంగా నివాళ్లు అర్పించారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో కొతారింగ్ తాళబద్ర, బొడ్డపాడు గ్రామాల్లో ఆయా విప్లవ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు ఇద్దరు ఉపాధ్యాయులైన వెంపటాపు, ఆదిబట్ల కై లాసాల 54వ వర్ధంతి సభను బుధవారం నిర్వహించారు. పార్టీ నాయకులు వంకల మాధవరావు, గొరకల బాలక్రి ష్ణ, కుసుమ పాల్గొన్నారు.

మోడల్‌గా రావాడ పీహెచ్‌సీ

రణస్థలం: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు రావాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అధునిక వైద్య పరికరాలతో మోడల్ ఆస్పత్రిగా మార్చడం సంతోషదాయకమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎస్.ఈశ్వరరావు తెలిపారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీ పరిశ్రమ సామాజిక కార్పొరేట్ బాధ్యతలో భాగంగా రూ.70 లక్షలు వెచ్చించి అధునాతన వైద్య పరికరాలు, ల్యాబ్ ఏర్పాటు చేశారు. వాటిని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ పైడిభీమవరం యూనిట్ హెడ్ కె.వి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా ఆస్పత్రి అభివృద్ధికి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. రావాడ పరిసర ప్రాంత ప్రజలకు ఆస్పత్రి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గతంలో మండలంలోని పాతర్లపల్లి పీహెచ్‌సీలో ఇదే తరహాలో మౌలిక వసతులు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో రావాడ పంచాయతీ కార్యదర్శి జానార్దన్ నాయుడు, ఎస్.యమున, రెడ్డీస్ హెచ్ఆర్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



నిరసన ప్రదర్శనలో అంగన్‌వాడీలు

శ్రీకాకుళం అర్బన్: అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు కె.కళ్యాణి అన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం కోరుతూ బుధవారం శ్రీకాకుళంలోని వైఎస్సార్ కూడలి వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కొత్త ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయని అన్నారు. గతంలో బీజేపీ ప్రభుత్వం అంగన్‌వాడీలకు వేతనాలు పెంచుతామని, ఐసీడీఎస్‌ను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అంగన్‌వాడీలకు గ్రాడ్యూటీ అమలు చేయమని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, దీనిని పక్కన పెట్టడం శోచనీయమన్నారు. వివిధ జిల్లాల్లో, కొన్ని ప్రాంతాల్లో అధికార పార్టీ నాయకులు అంగన్‌వాడీలను బలవంతంగా రాజీనామాలు చేయ్యాలని బెదిరిస్తున్నారని, కేంద్రాలకు తాళాలు వేస్తున్నారన్నారు. ఇటువంటి వేధింపులు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.జ్యోతి, వై.లీలారత్నం, పద్మజ, ఎస్.కృష్ణభారతి, డి.ముత్యాలమ్మ, ఇ.అప్పలనరసమ్మ, భవాని పాల్గొన్నారు.

జీఎస్టీ ఫెసిలిటేషన్ డ్రైవ్‌కు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ రాణిమోహన్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జీఎస్టీ ఫెసిలిటేషన్ డ్రైవ్‌కు సహకరించాలని వాణిజ్య పన్నుల శాఖ, శ్రీకాకుళం సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ ఎ.రాణిమోహన్ కోరారు. శ్రీకాకుళం నగరంలోని కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో బుధవారం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానంగా చిన్న వ్యాపారులకు సహాయ సహకారాలు అందించటం, ఎటువంటి రిజిస్ట్రేషన్ లేకుండా రిజిస్ట్రేషన్ పరిధి దాటి వ్యాపారం చేసేవారికి అవగాహన కల్పించాలన్నారు. కాంపోజిషన్ ట్యాక్స్ పరిధిలో ఉన్న వారు నార్మల్ టాక్స్ పరిధి కిందకు ఎందుకు మారాలో తెలియజేశారు. వర్తకుల సమస్యలను తెలుసుకోవడం, అవగాహన కల్పించడం డ్రైవ్ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఈ.ప్రతిభదేవి, ఎ.హైమవతి, రమణరావు, వర్తక సంఘం నాయకులు సాంబమూర్తి, మెట్ట నాగరాజు, శ్రీను,ఆనంద్, సతీష్, చంద్రశేఖర్, హరగోపాల్, శేఖర్, సతీష్, జగన్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

12న కొత్తమ్మతల్లి పూజా సామగ్రి విక్రయానికి వేలం

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి ఆలయంలో వివిధ పూజా సామగ్రి విక్రయానికి సంబంధించి ఈ నెల 12వ తేదీన వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో వాచకచర్ల రాధాకృష్ణ తెలిపారు. అమ్మవారి ఫొటోలు, రక్షలు, తాళ్లు విక్రయించుకోవడానికి, అలాగే అమ్మవారికి భక్తులు సమర్పిస్తున్న చీరలు, కొబ్బరి ముక్కలను పొందుటకు రెండేళ్ల కాలానికి వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల ఉన్న ముందుగా పేర్లను ఆలయంలో నమోదు చేసుకోవాలని ఈవో సూచించారు.

అసభ్యకర పోస్టులు పెడుతున్న వ్యక్తిపై ఫిర్యాదు



ఎస్ఐ పారినాయుడుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: తమ సామాజికవర్గంపై అసభ్యకరంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన పైల రాజగోపాల్ దాస్‌పై చర్యలు తీసుకోవాలని పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడుకు బుధవారం ఫిర్యాదు చేసి..వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలాస బ్రాహ్మణ సంఘ నాయకుడు అనిల్‌శర్మ మాట్లాడుతూ.. రాజగోపాల్ దాస్ సోషల్ మీడియా వేదికగా బ్రాహ్మణ కులాన్ని కించపరచారన్నారు. అతనిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



రణస్థలం: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు



ఎచ్చెర్ల: ధర్నాలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు



జి.సిగడాం: ధర్నా చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

రణస్థలం: కార్మికులకు కనీస వేతనాలు నెలకు రూ.26 వేల చొప్పున అమలు చేయాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. అఖిల భారత కోర్కెల దినోత్సవం సందర్భంగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం రణస్థలంలోని రామతీర్థాల కూడలిలో ర్యాలీ, తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మన్నాయుడు మాట్లాడుతూ విశాఖపట్నం జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్‌ను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్ కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలన్నారు. శ్యామ్ క్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ యాజమాన్యం 30 సంవత్సరాలు సర్వీసు పూర్తయిందని అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, వేతన ఒప్పందం చేయాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్ బి.హేమసుందరరావుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు వెలమల రమణ, ఎం.అప్పలనర్సయ్య, జి.కిరణ్, పి.రామకృష్ణ, సత్యనారాయణ, సీతప్పడు, బి.సన్యాసమ్మ, టి.పాపారావు, వి.లక్ష్మి, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

☛ ఎచ్చెర్ల క్యాంపస్: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని, లేదంటే భవిష్యత్తులో ఉద్యమాలు ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు స్పష్టం చేశారు. ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ ఆవరణలో బుధవారం అఖిల భాతర కోర్కెల దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ధర్నా నిర్వహించారు. కార్మిక యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

☛ జి.సిగడాం: కార్మికుల కోర్కెల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకుడు వెలమల రమణ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్మికుల కోర్కెల సాధన కోసం ఉద్యమం నిర్వహిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ, ఆశ, భోజనం పథకం నిర్వాహకులు, ఉపాధి, వెలుగు సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి



కౌలు రైతుల జాబితాను విడుదల చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలని మండల వ్యవసాయాధికారిణి ఉషాకుమారి తెలిపారు. మండల పరిధిలోని సిలగాం సింగువలస గ్రామంలో గుర్తింపు కార్డులపై కౌలు రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కౌలు గుర్తింపు కార్డు ఉంటే పంట రుణాలు, ఈ-పంట నమోదు, అన్నదాత సుఖీభవ, పంట నష్టపరిహారం, పంటల బీమా, పంట కొనుగోలు రాయితీకి అర్హులుగా పరిగణిస్తారన్నారు. కౌలురైతుల జాబితాను విడుదల చేశారు. నాయకులు కంచు వసంతరావు, దశరథ, ఎరుకునాయుడు ఉన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీపీఓ వెంకటేశ్వరావు

జి.సిగడాం: గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలితే సంబంధిత గ్రామ కార్యదర్శి, ఏఎన్ఎంలు బాధ్యత వహించాల్సి ఉంటుందని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరావు అన్నారు. మండలంలోని సంతవురిటి గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను బుధవారం పరిశీలించారు. వర్షకాలంలో సీజన్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు కాలువలను శుభ్రం చేయాలన్నారు. తాగునీటి బావులు, ట్యాంకుల్లో బ్లీచింగ్ వేయాలన్నారు. ఎంపీడీఓ వెంకన్నబాబు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ చందనాల గణపతి, పంచాయతీ కార్యదర్శి హిమబిందు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వాణిజ్యవేత్త మల్లేశ్వరరావు మృతికి ధర్మాన సంతాపం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రముఖ వాణిజ్యవేత్త, టీవీ సీరియల్స్ నిర్మాత శిమ్మ మల్లేశ్వరరావు మరణంపై మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. తన రాజకీయ జీవితంలో మల్లేశ్వరరావు నరసన్నపేట ప్రాంతంలో సహకరించారని గుర్తు చేసుకున్నారు. కిల్లాం పరిసర ప్రాంతాల్లో వారిది ప్రముఖమైన రాజకీయ కుటుంబమని, 20 ఏళ్లు సహకార పరపతి సంఘం అధ్యక్షునిగా మల్లేశ్వరరావు ఆ ప్రాంతానికి సేవలందించారని చెప్పారు. రైతు కుటుంబానికి చెందిన మల్లేశ్వరరావు పిల్లల చదువుల కోసం శ్రీకాకుళం వచ్చి తొలి ద్విచక్ర వాహన మొబైల్ డీలర్‌గా వ్యవహరించారని గుర్తు చేశారు. ఈ కష్టకాలంలో కుమారుడు రాజశేఖర్, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలన్నారు.

వారాహి అమ్మవారికి పుష్పాభిషేకం



వారాహి హోమం చేస్తున్న భక్తులు



పుష్పాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి నది ఒడ్డున ఉన్న బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో జరుగుతున్న వారాహి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం పుష్పాభిషేకం జరిగింది. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చనలు, వారాహి హోమం, యంత్రపూజ, ద్వాదశి హారతులు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి గృహాన్ని నిర్మించిన దాత

సంతబొమ్మాళి: నౌపడ గ్రామంలో నిరుపేద వృద్ధురాలు గుజ్జు బూలమ్మకు చెన్నూరు నారీమణి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మేస్త్రి రెయ్యి గోవింద సహాయంతో సుమారు రూ. 60 వేలు ఖర్చుతో నౌపడలోని ఓరిమడి దగ్గర గృహాన్ని నిర్మించారు. ఈ మేరకు బుధవారం స్థానిక మహిళలు, యువకుల ఆధ్వర్యంలో గృహప్రవేశం జరిపించారు. అంతేకాకుండా భూలమ్మకు నెల రోజులకు సరిపడా కిరాణా సరుకులను, వస్త్రాలను అందజేశారు. స్థానిక యువకులు శివ, సంతోష్, బాలరాజు, రాజబాబు, వాసు పాల్గొన్నారు.

